క్లుప్తంగా

వైభవంగా మస్తానయ్య ఉరుసు మహోత్సవం


పూజలందుకుంటున్న మస్తానయ్య

పుల్లలచెరువు: మండలంలోని కొత్తూరులో వెలసిన శ్రీ ఆషాకలేషా మస్తానయ్య ఉరుసు మహోత్సవాన్ని గురువారం గ్రామంలో ఎంతో వైభవంగా నిర్వహించారు. వేకువ జాము నుంచే చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విరివిగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం గ్రామస్తుల సహకారంతో పాటకచేరీ ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం నుంచి పావుకోళ్ల ఊరేగింపు ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యార్థుల వివరాలు సేకరించాలి


మాట్లాడుతున్న విద్యాశాఖాధికారి సుబ్బయ్య

తాళ్లూరు: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల పేర్ల నమోదు, డ్రాపౌట్లపై ప్రత్యేక శ్రద్ధ చేపట్టాలని మండల విద్యాశాఖాధికారులు సుబ్బయ్య, సుధాకర్‌రావు కోరారు. మండలంలోని తాళ్లూరు, తూర్పుగంగవరం, బొద్దికూరపాడు క్లస్టర్ కాంప్లెక్స్‌లో గురువారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్స్, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ టీచర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి-1 సుబ్బయ్య, విద్యాశాఖాధికారి-2 సుధాకర్‌రావు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపునకు, మధ్యలో బడి మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు తీసుకోవాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎస్.శేషగిరి, అరుణకుమారి, కరీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమానంతో భార్యపై దాడి

తర్లుపాడు: అనుమానంతో తనపై భర్త దాడి చేశాడని మార్కాపురం మండలం దరిమడుగు గ్రామానికి చెందిన కె.భవాని గురువారం మార్కాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. భవానీకి తర్లుపాడు మండలం రాగసముద్రం గ్రామానికి చెందిన వెంకటరావుతో వివాహమైంది. అయితే భర్త గత ఫిబ్రవరిలో మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. పట్టణానికి చెందిన శ్రీహరితో పరిచయం కాగా ఇటీవలే తనను పెళ్లిచేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. బుధవారం తాను పెద్దారవీడు మండలం కుంటలో వంట చేసేందుకు వెళ్లి వస్తుండగా తన భర్త శ్రీహరి తనను ఆటోలో నుంచి దించి బైక్‌పై ఎక్కించుకుని గొబ్బూరు వద్దకు రాగానే తీవ్రంగా కొట్టాడని తెలిపింది. అనంతరం ఇంటికి రాగా మళ్లీ కొట్టాడని ఫిర్యాదులో పేర్కొంది. విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో వారు జీజీహెచ్‌లో చేర్పించారు. మార్కాపురం పట్టణ పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

కంభం: ప్రభుత్వ పాఠశాలల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసులు సూచించారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా గురువారం కందులాపురం ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రణాళికలు రూపొందించాలని, విద్యా పథకాలను ప్రచారం చేస్తూ పాఠశాలల ప్రగతికి శ్రీకారం చుట్టాలని తెలిపారు. నూతన విద్యాసంవత్సరానికి సంబంధించి ఉపాధ్యాయులు తయారు చేసిన కరపత్రాలను పరిశీలించారు. పాఠశాలలో వసతులు, సౌకర్యాలు, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొమరోలు పోలీస్‌స్టేషన్‌కు డ్రోన్ కెమెరా


ఎస్పీ దామోదర్‌కు డ్రోన్ కెమెరా అందజేస్తున్న సుబ్బారెడ్డి

కొమరోలు: నేరాల నియంత్రణ కోసం కొమరోలు పోలీసుస్టేషన్‌కు పురుషోత్తమునిపల్లె గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ముత్యాల రామిరెడ్డి తన సొంత నిధులతో డ్రోన్ కెమెరా అందజేశారు. రామిరెడ్డి సోదరుడు సుబ్బారెడ్డి ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ దామోదర్‌కు రూ.2 లక్షల విలువ చేసే డ్రోన్ కెమెరాను గురువారం అందించారు. ఈ సందర్భంగా రామిరెడ్డిని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య, కొమరోలు ఎస్సై నాగరాజు పాల్గొన్నారు.

ఎండలు బాబోయ్..ఎండలు!


ఎండలు అధికంగా ఉండటంతో చెట్లను ఆశ్రయించిన మూగజీవాలు


పాఠశాల నుంచి చున్నీ కప్పుకొని ఇంటికి వెళ్తున్న బాలికలు

- విచిత్ర వాతావరణంతో ప్రజల ఆందోళన
- వేసవి దృష్ట్యా ఆరోగ్య సూత్రాలు పాటించాలంటున్న వైద్యులు

తాళ్లూరు:

మండలంలో ఎండలు విపరీతంగా ఉన్నాయి. పగలు పది దాటిందంటే చాలు 39 నుంచి 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాయంత్రం 5 గంటల వరకు ఉక్కపోతగా ఉంటోంది. రాత్రి మంచు కురుస్తోంది. విచిత్ర వాతావరణంతో మండల వాసులు ఆందోళన చెందుతున్నారు. మార్చి ముగిసి ఏప్రిల్ రావడంతో ఎండలు మండిపోతున్నాయి. మే నెలలో ఎండలు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం లేకపోలేదు. పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులకు అధికారులు ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నా పూర్తిస్థాయి సెలవులు ఎప్పుడిస్తారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. ప్రజలు చల్లదనాన్ని కోరుకుంటున్నారు. ఎండల తీవ్రతతో పండ్ల రసాలు, శీతల పానీయాల దుకాణాలకు గిరాకీ పెరిగింది. మేత కోసం పొలం వెళ్లిన పశువులు మధ్యాహ్నం అవుతుందో లేదో వేసవి తాపం తట్టుకోలేక చెట్ల నీడను వెతుక్కుంటున్నాయి. ఎండాకాలంతో అక్కడక్కడా వాగులు, చెరువులు ఎండిపోవడంతో పశువులకు, మూగజీవాలకు తాగునీటికై నీటి కుంటలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని పశుపోషకులు కోరుకుంటున్నారు. ఎండలు మండుతున్న తరుణంలో పాదచారులకు, వాహనదారులకు ఇప్పటి వరకు అధికారులు చలివేంద్రాలు ప్రారంభించలేదు. దాతలైనా ముందుకొచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. వేసవి కాలంలో కాస్తున్న ఎండలు దృష్టిలో ఉంచుకొని ప్రజలు మంచినీరు, మజ్జిగ, పండ్ల రసాలు అధికంగా తీసుకోవాలని, మరీ ముఖ్యంగా వృద్ధులు తగు జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు.


వేసవి తాపానికి పుచ్చకాయలు కొంటున్న ప్రజలు

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి:



వేసవి కాలంలో వీచే గాలులతో వడదెబ్బ ప్రభావం అధికంగా ఉంటుంది. వృద్ధులు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయటకు రాకూడదు. అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు సాయంతో వెళ్లడం మంచిది.

డాక్టర్లు మస్తాన్‌బీ, రాజేష్, పీహెచ్‌సీ, తాళ్లూరు

డీహైడ్రేట్ కాకుండా అధికంగా నీరు తాగాలి:



వేసవిలో ఎండలు అధికంగా ఉండటంతో శరీరంలో నీటి శాతం, ఉప్పు లవణాలు తగ్గి డీహైడ్రేట్ అయ్యే అవకాశం ఉంది. ప్రతి ఒక్కరూ రోజుకు 6 నుంచి 7 లీటర్ల నీరు తాగాలి. ఓఆర్ఎస్, మజ్జిగ, పండ్ల రసాలు అధికంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు.

డాక్టర్ మౌనిక, తూర్పుగంగవరం పీహెచ్‌సీ

జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి:



వేసవి కాలం ముగిసేంత వరకు ప్రతి ఒక్కరూ జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి. ఇంట్లో వండే తేలికైన ఆహారాన్ని తీసుకోవాలి. కుండలో నీరు తాగడం మంచిది. నల్ల దుస్తులు ధరించొద్దు. వేసవి కాలంలో ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోకుంటే ఇబ్బందులు పడతారు.

డాక్టర్ శ్రీకాంత్, తూర్పుగంగవరం పీహెచ్‌సీ

వర్మా..నోరు అదుపులో పెట్టుకో

- మాజీ మంత్రి కారుమూరిపై చేసిన వ్యాఖ్యలకు ఖండన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న యాదవ సామాజిక వర్గానికి చెందిన నాయకులు

యర్రగొండపాలెం: కూటమి భిక్షతో, ఈవీఎంల మాయాజాలంతో గెలిచి కేంద్ర సహాయ మంత్రిగా ఎదిగిన భూపతిరాజు శ్రీనివాసవర్మ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని వివిధ యాదవ సంఘాలకు చెందిన నాయకులు హెచ్చరించారు. ఇటీవల నరసాపురంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావుపై వర్మ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు, రాష్ట్ర మంత్రి లోకేష్‌లు అమలు పరుస్తున్న రెడ్ బుక్ పంథాలో నడవాలనుకుంటే ఇక్కడ ఎవరూ సహించరని, అందుకు యాదవ సంఘాలు తగిన బుద్ధి చెప్తాయని హెచ్చరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు దాటినా తాము ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు పరచకుండా కులాలను రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేస్తూ కాలం గడుపుతున్నారని, రాష్ట్రాభివృద్ధి పక్కనపెట్టి కనీసం నీవు గెలిచిన నరసాపురం పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధి వైపు దృష్టి పెట్టాలని సూచించారు. గత ప్రభుత్వ కాలంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అమలు చేయడంతో ఆయన్ను ప్రజలు తమ గుండెల్లో పదిలంగా దాచుకున్నారని, 2029లో తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అవుతారన్న విషయాన్ని మరచిపోవద్దన్నారు. జగన్ ప్రజాసేవ చేశారని, కూటమి నాయకులు రాష్ట్రాన్నే దోచుకుంటున్నారన్న విషయాన్ని మరిచి ఇష్టానుసారంగా ప్రవర్తించడం సరైంది కాదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉందని విర్రవీగి నోటికొచ్చినట్లు మాట్లాడితే రాష్ట్రంలో ఉన్న 75 లక్షల మంది యాదవ సామాజిక వర్గ ప్రజలు నీ నోటికి తాళం వేస్తారని, నరసాపురం పార్లమెంటులో ఉన్న తమ వర్గీయులు తగిన బుద్ధి చెప్తారని యాదవ సామాజికవర్గ నాయకులు హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇంటిలెక్చువల్ అధ్యక్షుడు అంగిరేకుల ఆదినారాయణ, జిల్లా యాక్టివిటీ సెక్రటరీ దోమకాళ్ల వెంకటేశ్వర్లు, పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ మూడమంచు బాల గురవయ్య, వివిధ విభాగాల నాయకులు, ప్రజా ప్రతినిధులు మురారి గాలెయ్య యాదవ్, గుమ్మా ఎల్లేష్ యాదవ్, తోకల ఆవులయ్య, గుర్రం ముత్యాలయ్య, రాగాల వెంకటయ్య, గుమ్మా గురవయ్య, ఒంటేరు రాజయ్య, గుమ్మా ఆంజనేయులు, పిట్టమల్ల వెంకటనారాయణ, సాదం పిచ్చయ్య, మేకల కాశయ్య, పాడతరపు వెంకటేశ్వర్లు యాదవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చర్యలు


సర్వే నంబర్ 8లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

కురిచేడు: మండలంలోని పడమరవీరాయపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 8లో ఉన్న 528.20 ఎకరాల భూమి ప్రభుత్వానిదని తహసీల్దార్ రజనికుమారి స్పష్టం చేశారు. ఆ భూమిని ఎవరైనా అన్యాక్రాంతం చేసినా, ఆక్రమించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరికతో కూడిన బోర్డును ఆ సర్వే నంబర్‌లో గురువారం ఆర్ఐ నాగరాజు, వీఆర్వో ఆంజనేయులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆ భూమిని ఆక్రమించి సాగు చేసిన వారిపై చర్యలేమిటి? ఆ సర్వే నంబర్‌కు సంబంధించి ఉన్న పట్టాల పరిస్థితి ఏమిటి? అవి నకిలీ పట్టాలా? లేక ప్రభుత్వం ఇచ్చిన పట్టాలా? తేల్చేదెవరు? క్రయవిక్రయాలను అడ్డుకుంటారా? ఆ పట్టాలు జారీ చేసిన వారిపై చర్యలు తీసుకుంటారా? అనే అనుమానాలను పడమరవీరాయపాలెం గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.


సర్వే నంబర్ 8లో ఇచ్చిన పట్టాలు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పుల్లలచెరువు: ప్రస్తుతం జిల్లాలో దొంగతనాలు పెరిగిన నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సంపత్‌కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామాల్లో ఊరికి చివర ఉండే గృహాలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రజలు పూర్తిగా పోలీసులకు సహకరించాలని కోరారు. గ్రామాల్లోకి కొత్త, అపరిచిత వ్యక్తులు వచ్చినా, వారి భాష, వేషధారణ తేడాగా ఉన్నా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఊరు వదిలి వెళ్లే వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. గ్రామాల్లో ఉండే యువత కూడా నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విజేతలకు మెడల్స్ అందజేత


మెడల్స్ అందుకున్న బాలబాలికలతో సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

పెద్దారవీడు: మండలంలోని రాజంపల్లి సమీపం కేంద్రియ విద్యాలయంలో హైదరాబాద్ రిజినల్ లెవల్ టేబుల్ టెన్నీస్ పోటీల్లో గెలుపొందిన బాల బాలికలకు మెడల్స్‌ను మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ గురువారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక ధృడత్వానికి ఉపయోగపడతాయని చెప్పారు. ఆరోగ్య సమస్యలు అధిగమించొచ్చన్నారు. స్థానిక కేంద్రియ విద్యాలయ అండర్-14 బాలికల విభాగంలో తృతీయ స్థానంలో 8వ తరగతి చదువుతున్న సుప్రజ, అండర్-19 విభాగంలో తృతీయ స్థానంలో 10వ తరగతి చదువుతున్న నేహాపూర్ణిమ విజేతలుగా నిలిచారని, జాతీయ స్థాయిలో టిబుల్ టెన్నీస్ పోటీలో పాల్గొంటారని పీఈటీ నాగేశ్వరరావు తెలిపారు. అండర్ 14, 17, 19 విభాగాల్లో టిబుల్ టెన్నీస్ పోటీలో గెలుపొందిన బాల బాలికలకు మెడల్స్ అందజేశారు. ప్రిన్సిపాల్ కర్తర్‌సింగ్ గుర్జర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారు బాల్యం ప్రాజెక్టు జిల్లా నోడల్ ఆఫీసర్‌గా గిరిధర శర్మ


కలెక్టర్ తమీమ్ అన్సారియాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గిరిధర శర్మ

రాచర్ల: జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బంగారు బాల్యం ప్రాజెక్టుకు నోడల్ ఆఫీసర్‌గా రాచర్ల ఎంఈవో-2 వారణాసి గిరిధరశర్మ నియమితులయ్యారు. బాల కార్మికులు, బాల్య వివాహాలు, బడి మానేసిన పిల్లల వివరాలు, పోషకాహార లోపం గల పిల్లలు, జననం, ఆధార్ సంబంధిత సమస్యలు, పిల్లలు ఎదుర్కొంటున్న లైంగిక పీడన చర్యలపై జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని బాధ్యతలు నిర్వహించాలని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనను మండల అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు జరగాలి


కాన్పులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జగదీష్‌బాబు

పెద్దారవీడు: గ్రామాల్లో గర్భిణులకు ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు అయ్యే విధంగా చూడాలని డాక్టర్ జగదీష్‌బాబు సూచించారు. స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలతో గురువారం ఆయన అత్యవసరంగా సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిధిలో జరుగుతున్న కాన్పులు మొత్తం ఇక నుంచి స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలోనే జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి గర్భవతికి కాన్పులపై అవగాహన కల్పించాలని చెప్పారు. గర్భిణులను ప్రైవేటు వైద్యశాలలకు తీసుకెళ్లొద్దని, అలా తీసుకెళ్లినట్లు తెలిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హరినాథ్, హెల్త్ సూపర్‌వైజర్ సుభాని, కనకదుర్గంబ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పుల్లలచెరువు: బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈవో ఇందిర అన్నారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా పుల్లలచెరువు బీసీ కాలనీ పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఆ పాఠశాల పరిధిలో ఉన్న పిల్లలను పాఠశాలలో చేర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి సౌకర్యాలతో పాటు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనంతో పాటు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం ఇవ్వనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు పూర్తి సహకారం అందించాలని కోరారు.

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో ప్రసాద్‌రావు

తాళ్లూరు: రెండు రోజులుగా కురిసిన వర్షాలకు, గాలులకు దెబ్బతిన్న మొక్కజొన్న, వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రాథమిక నివేదిక ప్రభుత్వానికి పంపినట్లు మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు తెలిపారు. మండలంలోని మాధవరం, కొత్తపాలెం, మన్నేపల్లి, తాళ్లూరు, కొర్రపాటివారిపాలెం గ్రామాల్లో 21 మంది రైతులకు సంబంధించి 9 ఎకరాల్లో వరి, 59 ఎకరాల్లో మొక్కజొన్న పంట చేతికొచ్చే దశలో పాక్షికంగా దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు. నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం అందేలా చూస్తామని ఏవో తెలిపారు. ఆయనతో పాటు వీఏఏలు సుధీర్, నాగమల్లేశ్వరి ఉన్నారు

దొనకొండ విద్యార్థికి ప్రథమ బహుమతి


ప్రశంసపత్రం అందుకుంటున్న దివ్య

దొనకొండ: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా యురేకా సైన్స్ ప్రయోగ పోటీలు నిర్వహించారు. పోటీల్లో దొనకొండ సెయింట్ ఆంథోనీస్ స్కూల్ విద్యార్థి దివ్య ప్రథమ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి బి.దేవిప్రసాద్, మండల కార్యదర్శి భూమన సురేష్ హాజరై మాట్లాడారు. ఆరోగ్యం, పర్యావరణ, సేవా ధృక్పదం, సైన్స్ అండ్ టెక్నాలజీ, వ్యవసాయం, మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు. సైన్స్ ఉపయోగాలు తెలిపారు. అనంతరం విద్యార్థి దివ్యను అభినందించారు. ప్రభు చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు ఆదిమూలపు ప్రభుదాసు, సెయింట్ ఆంథోనీస్ స్కూల్ కరస్పాండెంట్ జి.థామస్, ప్రిన్సిపాల్ అరుణ పవిత్ర పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌ను మరోచోట నిర్మించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

యర్రగొండపాలెం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్మించ తలపెట్టిన కళాశాలల బాలికల హాస్టల్‌ను మరో ప్రాంతంలో నిర్మించాలని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు గురువారం రెవెన్యూ, మండల పరిషత్, హైస్కూల్‌కు సంబంధించిన అధికారులకు వారు వినతి పత్రం అందజేశారు. హైస్కూల్లో ఉన్న క్రీడా మైదానాన్ని విద్యార్థులు, యువత క్రీడలకు, పట్టణ ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ ట్రాక్‌గా ఉపయోగించుకుంటున్నారని, అందరికీ అందుబాటులో ఉండే ఈ ఆట స్థలంలో భవన నిర్మాణాలు తలపెడితే అందరికీ ఇబ్బందిగా ఉంటుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని కళాశాలల విద్యార్థినులకు ఇబ్బంది కలగకుండా మరో ప్రాంతంలో హాస్టల్ భవనాల నిర్మాణాలు చేపట్టాలని వారు కోరారు.

వేసవి పంటల నమోదు వేగవంతం


ఈ-పంట నమోదు చేస్తున్న ఏఓ ఫరూక్

ముండ్లమూరు (కురిచేడు): వేసవి కాలంలో సాగు చేసిన పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ ఆదేశించారు. మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులు తమ గ్రామాల్లో సాగు చేసిన పంటలను వేగవంతంగా ఈ- క్రాప్ బుకింగ్ చేయాలని చెప్పారు. మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన పంటలను ఆయన గురువారం పరిశీలించారు. వేసవిలో సాగు చేసిన అపరాలు, నూనెగింజ పంటలు, పచ్చిరొట్ట పంటలు సాగు చేసిన రైతులు వారి పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు. ఈ-పంట నమోదు కార్యక్రమం ఈనెలాఖరుతో ముగుస్తుందన్నారు. ఈ ఏడాదికి సంబంధించి మండలాల వారీగా భూసార పరీక్ష ఫలితాల కోసం మట్టినమూనాల సేకరణ లక్ష్యాలను నిర్దేశించినట్లు తెలిపారు. మండలానికి 935 నమూనాలు సేకరించాలని ఆదేశించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు మీ మీ పరిధిలోని గ్రామాల్లో మట్టినమూనాల సేకరణ లక్ష్యాలను మే నెల 15వ తేదీ లోపు పూర్తి చేసి ఒంగోలు భూసార పరీక్ష కేంద్రాలకు పంపించాలని ఆదేశించారు. ఏఈఓ వేమూరి శ్రీకీర్తి, రైతులు పాల్గొన్నారు.